క్లుప్తంగా

పాఠ్య, నోట్ పుస్తకాలు సిద్ధం



పాఠ్య,నోట్ పుస్తకాలు

రోలుగుంట: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న పాఠ్య, నోట్ పుస్తకాలు మండల రిసోర్స్ కార్యాలయానికి చేరాయని ఎంఈవో జాను ప్రసాద్ తెలిపారు. 2024–20 విద్యా సంవత్సరానికి గాను తొలి విడతగా 18,219 పాఠ్య పుస్తకాలు, 17,082 నోట్ బుక్స్ వచ్చాయన్నారు. వీటిని పాఠశాలల వారీగా క్రమపద్ధతిలో హెచ్ఎంలకు పంపిణీ చేస్తామని వివరించారు.

ఏలేరు కాలువలో నాచు, గడ్డి తొలగింపు



నాచు, గడ్డిని తొలగిస్తున్న పొక్లెయిన్

మాకవరపాలెం: ఏలేరు కాలువలో జంగిల్ క్లియరెన్స్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలోని వజ్రగడ, దాలింపేట, కొండలఅగ్రహారం, పైడిపాల, లచ్చన్నపాలెం, మాకవరపాలెం, తామరం, రాచపల్లి, రామన్నపాలెం, శెట్టిపాలెం గ్రామాల సమీపంలో ఏలేరు కాలువ ఉంది. ఈ కాలువలో గట్లకు ఇరువైపులా జంగిల్‌తోపాటు గుర్రపుడెక్క, నాచు, గడ్డి అధికంగా పేరుకుపోయాయి. ఇవి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. నీటి సరఫరా లక్ష్యం కూడా చేరకపోవడాన్ని గుర్తించిన అధికారులు ప్రస్తుతం కొండలఅగ్రహారం వద్ద వాటిని తొలగించే పనులు చేపట్టారు. ఈ పనులు పూర్తయితే విశాఖ ప్రజలకు తాగు నీరు, స్టీల్ ప్లాంట్ అవసరాలకు ఆశించిన స్థాయిలో నీరు అందుతుందని జీవీఎంసీ అధికారులు తెలిపారు.

ప్రజలు శాంతియుతంగా ఉండాలి



ఎస్‌ఐ ఉపేంద్ర

గొలుగొండ: ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రజలు శాంతియుత వాతావరణంలో ఉండాలని, లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామని కృష్ణదేవిపేట ఎస్‌ఐ ఉపేంద్ర శుక్రవారం హెచ్చరించారు. ఈ నెల 4న ఓట్ల లెక్కింపు దృష్ట్యా గ్రామాల్లో ప్రశాంతంగా ప్రజలు ఉండాలన్నారు. ఇప్పటికే ప్రతీ గ్రామంలో కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. కౌంటింగ్ దృష్టిలో పెట్టుకుని ఎక్కడైనా బాణసంచా, డీజే, ఊరేగింపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. పోలీసులకు సహకరించాలని కోరారు.

పొగాకు వాడకం హానికరం



పొగాకు నష్టాలను వివరిస్తున్న హెల్త్ అసిస్టెంట్ రాజు

కె.కోటపాడు: పొగాకు వినియోగం వల్ల కలిగే అనారోగ్య పరిస్థితులను ప్రజలు గుర్తించాలని చౌడువాడ పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎస్.రాజు తెలిపారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పొగాకు వల్ల వ్యాప్తి చెందే అనారోగ్య సమస్యలపై ప్రజలకు ఆయన వివరించారు. పొగాకు వల్ల క్యాన్సర్‌తోపాటు పక్షవాతం, అంధత్వం, తదితర దీర్ఘకాలిక వ్యాధుల బారినపడతారన్నారు. స్టాఫ్ నర్స్ ధనలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ ఉమ, ల్యాబ్ టెక్నీషియన్ మాధురి, ఏఎన్ఎం సన్యాసమ్మ పాల్గొన్నారు.

రేపు మోదకొండమ్మ పండగ

మాడుగుల: ఒమ్మలిలో మోదకొండమ్మ పండగ ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ ఉగ్గిన వెంకటరమణ తెలిపారు. ఇప్పటికే అమ్మవారి ఆలయాన్ని రంగులతో అలంకరించామన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మాడుగుల: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు జరగనుందని ఎంపీడీవో కాశీప్రసాద్ తెలిపారు. ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి అధికారులు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు విధిగా హాజరు కావాలన్నారు.

హనుమాన్ ఆలయాల ముస్తాబు



మాకవరపాలెం: హోమాల్లో పాల్గొన్న భక్తులు



దేవరాపల్లి: కొల్లివానిపాలెంలో ముస్తాబైన అభయాంజనేయ స్వామి ఆలయం

దేవరాపల్లి: హనుమాన్ ఆలయాలు ప్రత్యేకంగా ముస్తాబయ్యాయి. స్వామివారి జయంతి వేడుకలను గ్రామ గ్రామాన శనివారం ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా రైవాడ పంచాయతీ శివారు కొల్లివానిపాలెంలోని అభయాంజనేయస్వామి సహా ఇతర గ్రామాల్లోని ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆయా ఆలయాల కమిటీ సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించనున్నారు. దేవరాపల్లి, కాశీపురం, బేతపూడి, కె.ఎం.పాలెం, తారువ తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించనున్నారు.

మాడుగుల రూరల్: మండలంలో పలు హనుమాన్ దేవాలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేయడానికి ఏర్పాట్లు చేశారు. కె.జె.పురం, వంటర్లపాలెం, ముకుందపురం, వీరవల్లి అగ్రహారం, ఎం.కోటపాడు, వీరనారాయణం, తదితర గ్రామాల్లో ఉదయం నుంచి తమలపాకలతో పూజలు చేయనున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నారు.

నేడు లచ్చన్నపాలెంలో అన్నసమారాధన

మాకవరపాలెం: హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం అన్నసమారాధన నిర్వహిస్తున్నట్టు లచ్చన్నపాలెం ఆంజనేయస్వామి ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్వామివారి జయంతి నేపథ్యంలో శుక్రవారం ఆలయం వద్ద హోమాల్లో భక్తులు పాల్గొని పూజలు చేశారు. జయంతి రోజు సాయంత్రం ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగింపు చేయనున్నట్టు తెలిపారు. అన్నసమారాధనలో భక్తులు పాల్గొనాలని కోరారు.

నాతవరం: మండలంలో హనుమాన్ ఆలయాలన్నీ సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. పలుచోట్ల విద్యుత్ అలంకరణతో ఏర్పాట్లు చేశారు. నాతవరం ఆంజనేయ స్వామి ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు రాష్ట్ర పామాయిల్ కార్పొరేషన్ డైరెక్టరు పైల పోతురాజు తెలిపారు. రాజుపేట అగ్రహారంలో వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గుడపర్తి అచ్చియ్యనాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు.

రావికమతం: హనుమజ్జయంతి సందర్భంగా రావికమతం, కొత్తకోట గ్రామాల్లో భక్తాంజనేయ స్వామి ఆలయాల్లో శనివారం విశేష పూజలు, అభిషేకాలకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేశారు. ఆయా ఆలయాల వద్ద అన్నసమారాధన నిర్వహించనున్నారు.

రోలుగుంట: మండలంలో హనుమజ్జయంతి వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. రోలుగుంట, బుచ్చింపేట గ్రామాల్లో ఆంజనేయస్వామి భక్తులు మాలధారణ చేశారు. వీరంతా వారం రోజులుగా ఆలయాలను శుద్ధి చేసి అభిషేకాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం పూజలు, అభిషేకాల అనంతరం భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని కొమరవోలులో నిర్వహిస్తామని ఆలయ కమిటీ తెలిపింది.



రోలుగుంట: హనుమాన్ దేవాలయంలో పూజలు చేస్తున్న మాలధారణ భక్తులు

నాతవరం కళాశాలలో చేరాలంటూ ప్రచారం

నాతవరం: స్థానిక హైస్కూల్‌లో ఈ ఏడాది నుంచి ఇంటర్మీడియట్ తరగతులు నిర్వహిస్తామని హెచ్ఎం ఎస్.శాంతికుమారి తెలిపారు. నాతవరం హైస్కూల్‌ను ప్రభుత్వం ఇటీవల కళాశాలగా అప్‌గ్రేడ్ చేసిందన్నారు. పదో తగరతి పాసైన విద్యార్థులంతా చేరాలంటూ శుక్రవారం ఉపాధ్యాయులతో కలిసి ప్రత్యేక వాహనంలో మండల వ్యాప్తంగా ప్రచారం నిర్వహించారు. ప్రథమ సంవత్సరం ఇంటర్ బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో అడ్మిషన్లు పొందాలన్నారు. కాలేజీ నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు హైస్కూల్ భవనంలోనే సమకూర్చామన్నారు. డి.యర్రవరం, గునుపూడి, తాండవ, చమ్మచింత, మన్యపురట్ల, ఎం.బి.పట్నం, నాతవరం హైస్కూళ్లలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పించారు. ఇతర వివరాలకు నాతవరం హైస్కూల్‌ను సంప్రదించాలన్నారు.



కారులో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

సరైన పత్రాలు లేని 87 వాహనాల స్వాధీనం

- రావికమతంలో పోలీసుల కార్డన్ సెర్చ్

రావికమతం: నేర నియంత్రణలో భాగంగా కొత్తకోట సీఐ ఎల్.అప్పలనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం రావికమతంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఉదయాన్నే పలువురు పోలీసులు వీధుల్లో గుంపులుగా తిరుగుతూ రోడ్డుపై వచ్చే వాహనాలనే గాక ఇంటి వద్ద పార్కింగ్ చేసిన బైకులను పరిశీలించారు. ఆయా వాహనాల లైసెన్స్, ఇతర పత్రాలు పరిశీలించారు. లేని వాటిని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ నెల 4న ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఎటువంటి అల్లర్లకు తావివ్వకుండా బయటి వ్యక్తులను నివారించేందుకు ఈ కార్యక్రమం చేపట్టామని సీఐ ఈ సందర్భంగా తెలిపారు. 87 బైక్‌లు, ఆటోలు, ఇతర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్‌ఐ ధనంజయ్ పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న వాహనాలు

ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు

కె.కోటపాడు: అంకిత భావంతో పనిచేసిన ఉద్యోగులకు ఎల్లప్పుడూ తగిన గుర్తింపు ఉంటుందని ఎంఈవోలు సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం చౌడువాడ హైస్కూల్ హెచ్ఎం ఈర్లె అప్పారావు ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా అభినందన కార్యక్రమంలో అప్పారావు సేవలను ప్రశంసించారు.

44 ఏళ్ల పాటు ఎంతోమంది విద్యార్థుల ఉన్నతికి కృషి చేశారన్నారు. అనంతరం అప్పారావు మాస్టారును వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, రిటైర్డ్ ఎంఈవో దాట్ల చంద్రశేఖర్ వర్మ, కింతాడ, కొత్తపెంట సర్పంచ్‌లు బండారు ముత్యాలనాయుడు, నీలిమా వెంకటరావు, పీఏసీఎస్ చైర్పర్సన్ ఆకుల సాయిప్రసాద్, మాజీ సర్పంచ్ బొయిదాపు జగదీశ్వరరావు, దాట్ల రవిబాబు, బొడ్డు దేముడుబాబు, వంటాకు గోవిందరావు, వంటాకు రామునాయుడు తదితరులు దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు.



అప్పారావును ఘనంగా సన్మానిస్తున్న శివాజీరాజు, తదితరులు

359 మందికి వైద్య సేవలు



కె.జె.పురం హైస్కూలులో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి సంతోష్‌కుమార్



కంటి రోగులను పరీక్షిస్తున్న ఆప్తాలమిక్ అసిస్టెంట్ నాగలక్ష్మి

మాడుగుల రూరల్: కె.జె.పురం హైస్కూలు ఆవరణలో ఆరోగ్య సురక్ష శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరంలో 352 మంది సాధారణ రోగులు వైద్య సేవలు పొందారు. ఏడుగురు కంటి రోగులను ఆప్తాలమిక్ అసిస్టెంట్ పి. నాగలక్ష్మి పరీక్షించారు. మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు సంతోష్‌కుమార్, నరేష్‌లతోపాటు కె.జె.పురం ప్రధాన వైద్యాధికారి ఎల్.వి.ఎస్.ఎస్. ప్రసాదుపాత్రుడు, కె. లీలాప్రసాదు రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కె.జె.పురం పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ అధికారి సీహెచ్ పుష్పమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ లలిత, ఏఎన్ఎంలు అచ్యుతాంబ, సత్యతోపాటు ఆశ కార్యకర్తలు కళావతి, లక్ష్మి, విజయ, వరహాలమ్మ పాల్గొన్నారు.

ఈ నెల పింఛన్లు బ్యాంకు ఖాతాల్లోనే..



సచివాలయ ఉద్యోగులకు సూచనలు చేస్తున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం: ఎన్నికల కోడ్ కారణంగా ఈ నెల పింఛన్లు లబ్ధిదారులు బ్యాంకు ఖాతాల్లోనే జమ చేస్తామని ఎంపీడీవో జాగరపు రాంబాబు తెలిపారు. ఆయన శుక్రవారం పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 31 పంచాయతీల్లో సామాజిక పింఛన్‌దారులు 11,414 మంది ఉన్నారన్నారు. వీరిలో 9,041 మంది పింఛన్ల నగదు బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామన్నారు. దివ్యాంగులు, వివిధ రోగాలతో ఇంటి వద్దే ఉంటున్న 2,375 మందికి సచివాలయ ఉద్యోగులు పంపిణీ చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు.

కౌంటింగ్ నిబంధనలపై సిబ్బందికి అవగాహన



మార్గదర్శకాలపై అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: ఎన్నికల కౌంటింగ్ మార్గదర్శకాలపై సిబ్బంది సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి హెచ్.వి.జయరాం పేర్కొన్నారు. కౌంటింగ్ మార్గదర్శకాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి పని చేయాలన్నారు. ఎలాంటి అపోహలకు తావులేకుండా సిబ్బంది సమర్థవంతంగా పని చేసి తుది అంకాన్ని పూర్తి చేయాలన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే ఆర్వో దృష్టికి తీసుకురావాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించిన విధంగానే కౌంటింగ్ ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు.

జంపెన వాసవీమాతకు ప్రత్యేక పూజలు

మాడుగుల రూరల్: జంపెన వాసవీమాత ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పుట్టా మోహన్‌రావు ఆధ్వర్యంలో వాసవీ మహిళలు, కింతలి గాదిరాయి వాసవీ క్లబ్ సభ్యులు కుంకుమ పూజలు చేశారు. ఆలయ కమిటీ వారు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



వాసవీమాత ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

పాత కేడీపేట నుంచి ఓట్ల లెక్కింపు

- సుభద్రయ్యపాలెం బూత్‌తో ముగింపు
- కౌంటింగ్‌లో ఒక్కో రౌండ్‌కు 14 టేబుళ్ల ఏర్పాటు
- 19 రౌండ్లలో తేలనున్న అసెంబ్లీ ఫలితం



ఓటు హక్కు వినియోగించుకున్న మహిళలు(ఫైల్)

నర్సీపట్నం: ఓట్ల లెక్కింపు ప్రక్రియ దగ్గర పడుతున్న కొద్దీ ఫలితంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే పోలింగ్ పూర్తయి అభ్యర్థుల భవితవ్యం ఈవీఎం బాక్సుల్లో నిక్షిప్తమై ఉండగా, ఈ నెల 4న కౌంటింగ్‌తో ఉత్కంఠకు తెరపడనుంది. నర్సీపట్నం నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రక్రియ గొలుగొండ మండలం పాత కేడీపేట ఒకటో నంబర్ పోలింగ్ బూత్ నుంచి ప్రారంభం కానుంది. గత నెల 13న నియోజకవర్గంలో 262 బూత్‌ల్లో పోలింగ్ నిర్వహించారు. నియోజకవర్గం వ్యాప్తంగా 2,12,076 మంది ఓటర్లు ఉండగా, వారిలో 1,79,852 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో మహిళలు 92,515 మంది, పురుషులు 87,334 మంది, థర్డ్ జెండర్ ఉన్నారు. మొత్తం 80 శాతంపైగా ఓటింగ్ నమోదైంది. వీరుగాక దివ్యాంగులు, 85 ఏళ్ల పైబడిన వృద్ధులు 178 మంది హోమ్ ఓటింగ్ హక్కు వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ఐదు వేలకుపైగా ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లా కేంద్రమైన అనకాపల్లి కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహిస్తారు. ఒక్కో రౌండ్‌కు 14 టేబుళ్ల ఏర్పాటు చేసి 14 ఈవీఎంలు లెక్కిస్తారు. ఇలా 19 రౌండ్లలో లెక్కించేటట్లు ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రక్రియ గొలుగొండ మండలం పాత కేడీపేట ఒకటో బూత్ నుంచి ప్రారంభమవుతుంది. నాతవరం, నర్సీపట్నం మున్సిపాలిటీ, నర్సీపట్నం రూరల్ మండలాల పోలింగ్ బూత్‌ల ఓట్లు లెక్కింపు జరుగుతుంది. చివరిగా మాకవరపాలెం మండలం సుభద్రయ్యపాలెం 262 పోలింగ్ కేంద్రం ఓట్లు లెక్కింపుతో కౌంటింగ్‌ను పూర్తి చేస్తారు. కౌంటింగ్ దగ్గర పడడంతో ప్రధాన పార్టీల అనుచరుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. గత ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికల్లో అధిక పోలింగ్ శాతం నమోదు కావడంతోపాటు మహిళలు ఎక్కువ మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో ఎవరికీ వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

రుచి శుచితో మధ్యాహ్న భోజనం



శిక్షణలో పాల్గొన్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు, సహాయకులు



స్నాక్స్ రుచి చూస్తున్న ఎంఈవో జాను ప్రసాద్

రోలుగుంట: మండల స్థాయిలో మధ్యాహ్న భోజన వర్కర్లు, హెల్పర్లకు వంటల తయారీ, గ్యాస్ స్టౌల వినియోగం, జాగ్రత్తలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానంగా విద్యార్థులకు రుచి శుచితో ఆహారం అందించడం, వారితో ప్రేమపూర్వకంగా మెలగడంపై రిసోర్స్ పర్సన్ రత్నం పలు సూచనలు చేశారు. ఉడికీ ఉడకని ఆహారం వల్ల అనర్థాలు, అనారోగ్యానికి దారి తీస్తాయన్నారు. వంటల్లో అవసరమైన జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు తయారు చేసి ప్రదర్శించి స్నాక్స్‌ను ఎంఈవోలు జాను ప్రసాద్, జగ్గారావు రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. నిర్వాహకుల సమస్యలను నివృత్తి చేశారు.

ఖరీఫ్ సాగుకు విత్తనాలు సిద్ధం

చోడవరం రూరల్: ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేసే రైతాంగానికి అవసరమైన వరి విత్తనాలను సిద్ధంగా ఉంచినట్టు లక్ష్మీపురం ఏఏవో ఫణీంద్ర శుక్రవారం తెలిపారు. గ్రామంలో రైతు భరోసా కేంద్రానికి వరి విత్తనాలు వచ్చాయన్నారు. తమ వద్ద ఆర్జీఎల్–2537, ఎంటీయూ–1064, బీపీటీ–3291, ఎంటీయూ–5204 రకాల విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. అవసరమైన రైతులు తమ కార్యాలయానికి వచ్చి వరి విత్తనాలను తీసుకెళ్లాలని సూచించారు. నారుమడులను సిద్ధం చేసుకుని తొలకరి వర్షాలు పడగానే విత్తనాలను వేసుకుంటే సకాలంలో వరి నాట్లు పూర్తి చేసి, తద్వారా అధిక దిగుబడులను సాధించడానికి వీలుంటుందని తెలిపారు. తమ కార్యాలయానికి సరఫరా చేయబడిన వరివిత్తనాల శాంపిళ్లను సేకరించి వాటి మొలక శాతాన్ని సైతం పరీక్షించినట్టు చెప్పారు.



విత్తన శాంపిళ్లు సేకరిస్తున్న ఏఏవో

లోక్ అదాలత్ విజయవంతం చేయండి

- అదనపు జూనియర్ సివిల్ జడ్జి సూర్యకళ



మాట్లాడుతున్న న్యాయమూర్తి సూర్యకళ



హాజరైన పోలీసు సిబ్బంది

చోడవరం రూరల్: వచ్చే నెలలో 29వ నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో అపరిష్కృత కేసులకు ఇరు వర్గాల సమ్మతితో పరిష్కారం చూపాలని చోడవరం అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.సూర్యకళ తెలిపారు. శుక్రవారం స్థానిక కోర్టు హాలులో పోలీసు వర్గాలతో ఆమె అవగాహన సమావేశం నిర్వహించారు. స్థానిక కోర్టుల పరిధిలో ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోకుండా అటు కక్షిదారులు ఇటు కోర్టు, పోలీసు, న్యాయవాద వర్గాల విలువైన కాలం వృథా అవుతున్నందున ఆయా కేసులను గుర్తించాలని సూచించారు. వాటిలో ఇరువర్గాల కక్షిదారులను సమీకరించి ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని కనుగొనడానికి కృషి చేయాలన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కరింపబడే కేసులకు వర్తించే ప్రయోజనాలను వివరించాలన్నారు. కోర్టులో ఎప్పటికో లభించే తీర్పు వల్ల కలిగే ఉపశమనం కన్నా లోక్ అదాలత్ తీర్పునకు అదనపు లబ్ధిని వారికి వివరించి సంబంధిత కేసులను పరిష్కరించాలని సూచించారు. దీని కోసం తమ తమ పరిధిలో కేసులను ముందుగా గుర్తించి సంబంధిత కక్షిదారులతో సంప్రదింపులు చేసి అధిక సంఖ్యలో విముక్తి కలిగించడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోర్టు క్లర్క్ శ్రీనివాస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాలలకు ఉత్సాహంగా పోటీలు



క్విజ్ పోటీ నిర్వహిస్తున్న దృశ్యం

రావికమతం: కొత్తకోట శాఖా గ్రంథాలయంలో బాల బాలికలకు ఆటలు పోటీలతోపాటు కథలు, బుక్ రీడింగ్ కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శుక్రవారం ఆట పాటలతో పుస్తకాలు చదివించారు. బాలలతో కథలు చెప్పిస్తూ వారికి ఏయే కళల పట్ల మక్కువ ఉందో తెలుసుకుని తర్ఫీదు ఇస్తున్నారు. ఈ నెల 7న ముగింపు కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేస్తామని గ్రంథపాలకురాలు వరహామణి తెలిపారు.



బాలలతో కథలు చెప్పిస్తున్న దృశ్యం

రిటైర్డ్ హెచ్ఎంకు సన్మానం

నర్సీపట్నం: పదవీ విరమణ పొందిన హెచ్ఎం గండి గడ్డి నాయుడు దంపతులను యూటీఎఫ్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. 42 ఏళ్లపాటు ఉపాధ్యాయుడిగా సేవలందించి, ఎంతో మంది విద్యార్థుల ఉన్నతికి బాటలు వేశారని జిల్లా కార్యదర్శి కె.సతీష్, ఉపాధ్యక్షుడు చిట్టియ్య కొనియాడారు. మాస్టార్ యూటీఎఫ్ బలోపేతానికి విశేష కృషి చేశారన్నారు. ఆయన శేషజీవితం ప్రశాంతంగా సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జల్లూరి ప్రసాద్, శోభన్, రాజుబాబు, తాతబ్బాయి తదితరులు పాల్గొన్నారు.



హెచ్ఎం గడ్డినాయుడు దంపతులను సన్మానిస్తున్న యూటీఎఫ్ నాయకులు